ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఇబ్రహీంపట్నం, జనవరి 23 : పదో తరగతి ఫలితాల్లో ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్టీయూటీఎస్ రంగారెడ్డిజిల్లా నూతన డైరీని ఆయన కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడుతూ.. గత ఫలితాల కన్నా ఈ సంవత్సరం మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, పరమేశ్, బాలకృష్ణ, పాండురంగారెడ్డి ఉన్నారు.

ఆర్మ్‌డ్ పోలీస్ అధికారులకు ప్రాథమిక శిక్షణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 23 : ప్రతి ఒక్క పోలీస్ నూతన ఉత్తేజంతో, క్రమశిక్షణతో ముందుకు సాగాలని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. మంగళవారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ అధికారుల్లో నూతన ఉత్తేజం తీసుకొచ్చేందుకు ప్రాథమిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక శిక్షణలో పేర్కొన్న పోలీస్ మాన్యువల్ ప్రకారం ఎలాంటి లోటుపాట్లు లేకుండా తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మొబిలైజేషన్ శిక్షణా కార్యక్రమం ద్వారా ఏఆర్ పోలీస్ అధికారులకు 15 రోజులపాటు ప్రతి సంవత్సరం శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులకు ప్రాథమిక శిక్షణ (బేసిక్ ట్రైనింగ్)లో ఇచ్చిన పరేడ్, ఫైరింగ్, లాఠీ డ్రిల్, మబ్ ఆపరేషన్ డ్రిల్, ఇండోర్ తరగతులు తదితర అంశాలపై మళ్లీ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఖాకీ యూనిఫారం ధరించిన ప్రతి ఒక్కరం పోలీస్ కుటుంబంలో సభ్యులమే.. నీట్ టర్న్ ఔట్‌తో క్రమశిక్షణతో తనతో విధుల్లో పాల్గొనాలన్నారు. విధులకు సంబంధించి మరిన్ని విషయాలను మరొకసారి క్లుప్తంగా నేర్చుకోవడం జరుగుతుందని వివరించారు. ప్రతి పోలీస్ అధికారి తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ శాంతి భద్రతలో అత్యుత్తమ పాత్ర పోషించాలని తెలిపారు. కుటుంబాన్ని కూడా క్రమశిక్షణతో, బాధ్యతతో చూసుకోవాలన్నారు. మంచి సమాజ స్థాపనలో కుటుంబాల పాత్ర చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఏదైనా సమస్యలుంటే ఎప్పుడైనా పోలీస్ అధికారులను సంప్రదించవచ్చని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఏవో జ్యోతిర్మయి, ఆర్ఐలు సూరపునాయుడు, అంజాద్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

దళిత బంధు అందించండి

కడా, తహసీల్దార్, ఎంపీడీవోకు వినతిపత్రాలు


తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్ర అందిస్తున్న దళితబంధు, అంబేద్కర్ సంఘం నాయకులు

కొడంగల్, జనవరి 23 : వెనుకబడ్డ దళితులకు ఆర్థికంగా చేయూతరందించేందుకు గత ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని అమలు చేసి ఉపాధి అవకాశాలను కల్పించిందని.. రెండో విడుత దరఖాస్తు చేసుకున్న దళిత బంధు లబ్ధిదారులకు పథకాన్ని వర్తింపజేయాలని దళిత బంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ ఎరన్‌పల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి(కడా) వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో పాండులకు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం దళిత బంధు పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఐడీ నెంబర్ క్రియేట్ కావడంతోపాటు దళిత బంధు ఖాతాలు తెరిచారన్నారు. ఎన్నికల కారణంగా పథకానికి సంబంధించి నిధులు మంజూరు కాలేకపోయాయని, ఆ లబ్ధిదారులకు నిధులను మంజూరు చేయించి వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం తాలుకా అధ్యక్షుడు రమేశ్‌బాబు, సాధన సమితి జిల్లా కో కన్వీనర్ దత్తు, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు దస్తప్ప, దళిత బంధు సాధన సమితి సభ్యులు హన్మంతు, శ్రీనివాస్, నర్సింహులు, విజయ్, శామప్ప, అంజి, సాయిలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల కల్పన

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- జాబ్ మేళాలో నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు అందజేత

పరిగి, జనవరి 23 : నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికే జాబ్ మేళా నిర్వహించినట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పరిగిలో నిర్వహించిన జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్ మేళాలో అనేక కార్పొరేట్ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. వివిధ కంపెనీలు పరిగికి వచ్చి జాబ్‌మేళాలో ఈ ప్రాంత యువతకు ఉద్యోగాలు ఇవ్వడం సంతోషించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే రాష్ట్రం తెచ్చుకున్నామని, ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తానన్నారు. 50 కంపెనీలు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాయి. జాబ్‌మేళాకు చక్కటి స్పందన వచ్చిందని చెప్పారు. పేదలకు సరైన వైద్య సేవలు అందేలా చూడడం, పేద విద్యార్థులకు విద్యనందించేందుకు మూడు రంగాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భవాని, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ షేక్ అబ్దుల్ సుభాన్, దోమ ఎంపీపీ అనసూయ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు కృషి చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరిగిలో ఏర్పాటుచేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదేండ్ల కాలంలో గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు విశేషంగా కృషి చేశారన్నారు. బిల్లులు విడుతలవారీగా చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో పరిగి, కులకచర్ల ఎంపీపీలు అరవింద రావు, సత్యమ్మ, పరిగి, పూడూరు, గండీడ్ జడ్పీటీసీలు హరిప్రియ, మేఘమాల, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో శేషగిరిశర్మ, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అశోక్‌వర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 23 : తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని వారి నివాసంలో మంగళవారం వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వికారాబాద్ జిల్లా అభివృద్ధి పనులపై సమీక్షించారు.

ట్రెసా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

వికారాబాద్, జనవరి 23 : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (ట్రెసా) డైరీ, క్యాలెండర్‌లను వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. 2024 క్యాలెండర్, డైరీలను కార్యాలయ అధికారులు, ట్రెసా అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్డీవోలు విజయకుమారి, శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో అమరేందర్, అసోసియేషన్ నాయకులు, రెవెన్యూ శాఖ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

వికారాబాద్, జనవరి 23 : గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులందరూ చర్యలు చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఘనంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మండల స్థాయి, కార్యాలయాలు, పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉదయం 8 గంటలకే పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు పతాకావిష్కరణ ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్‌లోని అన్ని శాఖల అధికారులు వారి సిబ్బందితో తప్పక కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానించాలని, ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీరు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్టాళ్లతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, అన్ని శాఖల అధికారులున్నారు.

భారం కాదు.. భరోసా..

- హెల్మెట్ వినియోగం తప్పనిసరి అంటున్న పోలీసులు, రవాణాశాఖ
- లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 23 : ఉరుకులు.. పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించక తప్పడంలేదు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ లేకపోవడంతో చాలామంది అక్కడికక్కడే మృతిచెందిన, గాయాలైన సందర్భాలు నిత్యం చూస్తూనే ఉన్నాం. హెల్మెట్ ఉంటే ఏమీ జరుగకుండా ఉండేది అనుకుంటామే తప్ప హెల్మెట్‌ను మాత్రం పెట్టుకోవడంలేదు. అవగాహన లేని వాహనదారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండదని వాహనాల తయారీదారులు, రవాణావాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నప్పటికీ గమ్యానికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో హెల్మెట్ వాడకాన్ని విస్మరిస్తున్నారు. శరీరంలో అన్ని అవయవాల కంటే తలకు విశిష్టమైన స్థానం ఉన్న సంగతి తెలిసిందే. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మెదడుకు దెబ్బ తగిలినచోట ఉన్న మెదడు కణాలుగా పిలిచే న్యూరాన్లు నశిస్తాయి. దీనివల్ల అవయవాలు శాశ్వతంగా చచ్చుబడిపోతాయి. కాబట్టి తలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ కచ్చితంగా పెట్టుకోవాలని మోటారు వాహనాల చట్టం 1998లోని 129, 177 సెక్షన్లు చెబుతున్నాయి. దీని ప్రకారం ఎవరైనా హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధించే అవకాశాలున్నాయి. పదేపదే వాహనదారుడు హెల్మెట్ లేకుండా జరిమానా పడుతుంటే డ్రైవింగ్ లెసెన్స్ శాశ్వతంగా రద్దుచేసే అవకాశముంటుంది. యువత హెల్మెట్ పెట్టుకోవడాన్ని నామోషీగా ఫీలవుతూ.. రోడ్డు ప్రమాదాలకు గురై తమ నిండు ప్రాణాలను బలిచేసుకుంటున్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ లేకుండా వచ్చే ద్విచక్ర వాహనదారుల వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయటం లేదు. రిజిస్ట్రేషన్ సమయంలో హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే మోటారు యాక్ట్ చట్టం కింద జరిమానా విధించటంతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తాం. ఇబ్రహీంపట్నంలో ఇప్పటికే పలుమార్లు హెల్మెట్ ధరించనివారికి అవగాహన కూడా కల్పిస్తున్నాం. హెల్మెట్ ధరించకుండా రోడ్లపై ప్రయాణం చేస్తే సహించేదిలేదు.

- గురునాయుడు, ట్రాఫిక్ సీఐ, ఇబ్రహీంపట్నం


హెల్మెట్ ధరించని వారిని కెమెరాలో బంధిస్తున్న ట్రాఫిక్ పోలీసు

నాణ్యమైన హెల్మెట్ ఉపయోగించాలి

నాసిరకం హెల్మెట్ పెట్టుకుంటే ప్రమాద తీవ్రతను ఏమాత్రం తగ్గించలేవన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవడంతో హెల్మెట్ కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. హెల్మెట్ స్ట్రాప్ గడ్డంపై ఉంచేందుకు అనువుగా ఉండేలా ఎంపిక చేసుకోవాలి. తలకు ధరించినప్పుడు స్ట్రాప్ తీసుకునేందుకు, పెట్టుకునేందుకు వీలుగా ఉండాలి. ప్రధానంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఐఎస్ఐ అనుమతులు పొందిన కంపెనీల హెల్మెట్‌లు ధరించాలని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు. హెల్మెట్ వాడటం వల్ల ప్రమాదాలు జరిగినా తలకు అయ్యే గాయాల తీవ్రతను తగ్గిస్తుంది. ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి 98 శాతం బయటపడొచ్చు. దుమ్ము, దూళి, ఎండ నుంచి రక్షణ కల్పిస్తుంది.

ఐఎస్ఎల్ ఓవరాల్ ఛాంపియనషిప్ కైవసం చేసుకున్న చేవెళ్ల పాఠశాల విద్యార్థినులు

విద్యార్థినులు అంజలి, వైష్ణవి

మొయినాబాద్, జనవరి 23 : ఇంటర్ సొసైటీ లీగ్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ 2023-24 క్రీడా పోటీల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. జనవరి 17 నుంచి 20 వరకు అదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరులో జరిగిన ఇంటర్ సొసైటీ క్రీడా పోటీల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ, గిరిజన విద్యా సంస్థ, మైనార్టీ విద్యా సంస్థ, మహాత్మా జ్యోతిరావుపూలే విద్యా సంస్థ, కస్తూర్బా విద్యా సంస్థలకు సంబంధించిన విద్యార్థినులు పాల్గొన్నారు. అందులో భాగంగా అన్ని క్రీడల్లో చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు సైతం పాల్గొని తమ సత్తా చాటి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకొని పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చారు. 9వ తరగతి విద్యార్థిని అంజలి కబడ్డీ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. 7వ తరగతి విద్యార్థిని ఎస్.వైష్ణవి అథ్లెటిక్స్ అండర్-14లో ప్రథమ స్థానపంలో నిలువగా.. 4/100 రిలేలో ప్రథమ స్థానం కైవసం చేసుకుని వ్యక్తిగతంగా ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను నిలబెట్టుకుంది. ఈ సందర్భంగా అంజలి, వైష్ణవిలను తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి నవీన్ నికోలస్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారదావెంకటేశ్, చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి ప్రత్యేకంగా అభినందించారు.

పార్టీ జెండా ఆవిష్కరణలో సీపీఐ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు

పేదోళ్లకు పట్టాలు ఇవ్వాలి

పెద్దఅంబర్‌పేట, జనవరి 23 : ప్రభుత్వం గరీబోళ్లకు జాగా పట్టాలు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు సమీపంలోని రావి నారాయణరెడ్డి ఫేజ్-3 కాలనీలో సర్కారు స్థలంలో గుడిసెలు వేసి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. జాగా సాధించేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. అర్హులకు పట్టాలు ఇప్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. పక్కా ఇల్లు సైతం మంజూరు చేయాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలని, రేషన్‌కార్డులు అందజేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని మట్టి కరిపించాలని మరో సీపీఐ నేత ముత్యాల యాదిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహ, జంగయ్య, రవీంద్రాచారి, నర్సింహ, కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్ ఉన్నారు.

మంచి భవిష్యత్తు ఇవ్వాలి

- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
- పిల్లలను దత్తత తీసుకున్న దంపతులు

దంపతులకు పిల్లలను దత్తత ఇస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 23 : దత్తత తీసుకున్న పిల్లల పాలన బాగా చూసుకొని వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిశు గృహ ద్వారా నిర్వహించిన దత్తత కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ చేతుల మీదుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న దంపతులకు పిల్లలను దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలు ఇద్దరి సంపద అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి లలితాకుమారి, శిశు గృహ మేనేజర్ పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం తనిఖీ

ఆదిబట్ల, జనవరి 23 : ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 2023-2024 సంవత్సరం బడ్జెట్ డ్రాఫ్ట్ ఏర్పాటుపై మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ పన్ను వసూలు టార్గెట్‌ను చేరుకోవాలన్నారు. మున్సిపల్‌లోని రికార్డులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, మేనేజర్ శ్రీనివాస్, టీపీవో, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిబట్ల మున్సిపల్ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డికి షోకాజ్ నోటీస్

ఆదిబట్ల, జనవరి 23 : కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆదిబట్ల చైర్‌పర్సన్‌గా ఉన్న కొత్త అర్తికపై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి అవిశ్వాసం పెట్టడానికి ప్రయత్నించగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఈ నెల 16న షోకాజ్ నోటీసు జారీ చేశారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, డీసీసీ అధ్యక్షుడికి ఎలాంటి సమాచారం తెలుపుకుండా అవిశ్వాసం పెట్టాలని చూస్తున్నారని ఆ షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. ఈ విషయమై పార్టీకి సమగ్ర సమాచారం అందించనట్లయితే పార్టీ నుంచి తొలగించి తగు చర్యలు తీసుకుంటామని నోటీసులో తెలియజేశారు.

RANGA REDDY DISTRICT CONGRESS COMMITTEE
GANDHI BHAVAN, HYDERABAD - 500 001.
CHALLA NARSIMHA REDDY
President

స్వర్ణోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అతిథులు

వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు స్వర్ణోత్సవం

ఓయూ బిజినెస్ విభాగానికి 50 ఏండ్లు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రారంభమై 50 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా మంగళవారం వైభవంగా స్వర్ణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ ఉత్సవాలను పలువురు ప్రముఖులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ, ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, మేనేజ్‌మెంట్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్యామ్‌మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విభాగం 50 ఏండ్ల చరిత్రలో వేలాది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిందని గుర్తు చేశారు. సమాజానికి అద్భుతమైన నిపుణులను అందజేసిందన్నారు. అంకితభావానికి, నైపుణ్యానికి వేదికగా నిలిచిందన్నారు. మేనేజ్‌మెంట్ రంగంలో ఓయూకు బలమైన ప్రపంచ స్థాయి పూర్వ విద్యార్థుల సమూహం ఏర్పడిందని పేర్కొన్నారు. ఓయూ ఎంబీఏ గ్రాడ్యుయేట్లకు ప్రపంచ స్థాయిలో విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూనివర్సిటీ బ్రాండ్ ఈక్విటీని పెంపొందించడం ద్వారా డిపార్ట్‌మెంట్ ప్రస్థానాన్ని, విజయాలను విభాగం హెడ్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ప్రసన్నచంద్ర, టీవీ రావు, మేనేజ్‌మెంట్ డీన్ వెంకటయ్య, జహంగీర్, స్మిత సాంబ్రాణి, సంపత్ కుమార్, విద్యాసాగర్‌రావు, సమున్నత, నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే ఇవ్వాలి

ప్రొఫెసర్ అన్సారీ శాంతియుత దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: తనకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ఇవ్వాలని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మంగళవవారం ఆందోళనకు దిగారు. ఓయూ లింగ్విస్టిక్స్ విభాగంలో ప్రొఫెసర్ మహ్మద్ అన్సారీ సుదీర్ఘకాలం పనిచేసి గతేడాది పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ చేసి సంవత్సరం గడుస్తున్నా నేటికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓయూ పరిపాలనా భవనం ముందు శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ తనపై కక్ష గట్టి తనకు రావాల్సిన ప్రయోజనాలను నిలిపివేయించాడని ఆరోపించారు. పదవీ విరమణ అనంతరం రావాల్సిన ప్రయోజనాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. తక్షణమే తనకు రావాల్సిన ప్రయోజనాలను ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.